# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఒకటో తేదీ, ఒక గంట, ఒకేసారి శ్రమదానం కార్యక్రమాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా నిర్వహించారు.**

**2. తెలంగాణ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు అభివృద్ధి పథకాలను ఈరోజు ప్రారంభిస్తారు, మరికొన్నింటికి శంకుస్థాపన చేస్తారు.**

**3. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్లనే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిందని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు.**

**4. ఆసియా గేమ్స్‌లో భారత క్రీడాకారులు ఈ ఉదయం ఒక స్వర్ణ పతకం, రెండు రజత పతకాలు సాధించారు.**

==========================

ప్రజలందరూ ఇవాళ ఒక గంట పరిశుభ్రతకు కేటాయించాలని ప్రధానమంత్రి కోరారు. ఈ ఉదయం పది గంటలకు పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొనాలని సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేసారు. స్వచ్ఛభారత్ దేశ ప్రజలందరి సమష్టి బాధ్యత అని... దేశాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలనీ పిలుపునిచ్చారు. రేపు గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ "ఒకటో తేదీ, ఒక గంట పాటు, ఒకేసారి" పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశంలోని 6లక్షల 40 వేల స్థలాల్లో శ్రమదానం చేసారు. మార్కెట్ స్థలాలు, రైల్వేట్రాకులు, చెరువులు, కుంటలు, పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు... వంటి బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రం చేసారు.

--------------------------

రేపు గాంధీ జయంతి సందర్భంగా ఇవాళ దేశవ్యాప్తంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర మంత్రులు శ్రమదానంలో పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చీపురు పట్టి రహదారులు శుభ్రం చేసారు. కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, తదితరులు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే తమ రాష్ట్రాల్లో శ్రమదానం చేసారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా స్వచ్ఛతే సేవ కార్యక్రమం జరిగింది. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరుపతి-రేణిగుంట మార్గంలోని రైల్వేక్వార్టర్స్ లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సిఆర్ ఎస్ చీఫ్, వర్క్ షాప్ మేనేజర్ ఎ దేవసహాయం మాట్లాడుతూ... గంటపాటు స్వచ్ఛతే సేవ

కార్యక్రమం నిర్వహించామన్నారు. 500 మందికి పైగా రైల్వే సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారని చెప్పారు. ప్రజలు కూడా తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నించాలన్నారు. శెట్టిపల్లికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

---------------------------

తిరుపతిలోని అలిపిరి లింక్ బస్టాండ్ వద్ద స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు పాల్గొన్నారు. బిజెపి నేతలు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్త శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజైన సెప్టెంబర్ 17 నుంచి సేవా పక్షోత్సవాలు జరుపుతున్నట్లు చెప్పారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే ఎగ్జిబిషన్లు నిర్వహించినట్టు చెప్పారు. స్వచ్ఛ సేవ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని చెప్పారు. అలిపిరి లింక్ బస్టాండ్ వద్ద భక్తులు తమతో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించారు.

---------------------------

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, మల్కాపురంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు జరిగాయి. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్ శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తడిచెత్త ,పొడిచెత్తలను సేకరించి వీధులను శుభ్రంచేసారు.

కాగా... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ రోజు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రకాశం జిల్లాలోని అన్ని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిదని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, ప్రజలు ఒంగోలులోని పోతురాజు కాలువ, సమీప కాలనీలలో పరిసరాలను శుభ్రం చేశారు. పోతురాజు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్ పర్యటన కోసం విస్తృత భద్రతా ఏర్పాట్లు జరిగాయి. ఆయన ఈ మధ్యాహ్నం హైదరాబాద్ వచ్చి, ప్రత్యేక హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ చేరుకుంటారు. 13న్నర వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. కొన్నిటికి శంకుస్థాపన చేస్తారు. హసన్ – చర్లపల్లి ఎల్పీజీ పైప్‌లైన్‌ను జాతికి అంకితం చేస్తారు. కృష్ణపట్నం – హైదరాబాద్ మధ్య మల్టీ ప్రోడక్ట్ పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మునీరాబాద్–మహబూబ్‌నగర్ కొత్త రైలు మార్గాన్ని జాతికి అంకితం చేస్తారు. కాచిగూడ – రాయచూర్ – కాచిగూడ డెమూ రైలు సర్వీస్‌ను, సూర్యాపేట–ఖమ్మం నాలుగులైన్ల రహదారినీ ప్రారంభిస్తారు. మరికొన్ని రహదారి ప్రాజెక్టులకు పునాదిరాయి వేస్తారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్మించిన నాలుగు భవనాలను వర్చువల్ గా ప్రారంభిస్తారు. ఈ వివరాలను ఆకాశవాణి ప్రతినిధి లక్ష్మి అందిస్తారు...

వాయిస్ – 35 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం నిజామాబాద్ లో పర్యటిస్తారు. రామగుండంలో ఎన్‌టీపీసీ నిర్మించిన 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలో 20 జిల్లా కేంద్రాల్లోని

ఆసుపత్రుల్లో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి మనోహరాబాద్ వరకూ, మహబూబ్‌నగర్ నుంచి కర్నూల్ వరకూ మొత్తం 348 కిలోమీటర్ల మేర విద్యుదీకరించిన రైల్వే లైన్‌ను జాతికి అంకితం చేస్తారు. మనోహరాబాద్-సిద్దిపేట మధ్య నిర్మించిన 76 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని కూడా ప్రారంభిస్తారు.

---------------------------

బెంగళూరు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నుండి కృష్ణా జిల్లాకు చేరుకున్న నూతన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పరిశీలించారు. 5620 బ్యాలెట్ యూనిట్లు, 4320 కంట్రోల్ యూనిట్లు, 5300 వివి ప్యాట్ యంత్రాలు బెంగళూరు నుండి మచిలీపట్నం కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఇంజనీర్లు ఈవీఎంలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అని పరీక్షించారు. ఆ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆ కార్యక్రమంలో డిఆర్వో పి వెంకటరమణ, ఈవీఎంల ప్రత్యేక అధికారి డిపిఓ నాగేశ్వర్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం తహసిల్దార్ సురేష్, డిటి శ్యామ్ పాల్గొన్నారు.

---------------------------

ప్రభుత్వ పథకాలపై ప్రజాచైతన్యం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. శనివారం పెడన మండలం ఉరిమి గ్రామంలో మంత్రి పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరించారు, కరపత్రాలు పంచారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన గణాంకాలను వివరిస్తూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే పేదరికం తగ్గుముఖం పట్టిందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆసియన్ గేమ్స్‌లో భారత్ మరో మూడు పతకాలు సాధించింది. షూటింగ్ పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో చెనాయ్, జోరావర్ సింగ్, పృథ్వీరాజ్ బృందం స్వర్ణ పతకం గెలుచుకుంది. షూటింగ్‌లోనే మహిళల ట్రాప్ టీమ్ విభాగంలో మనీషా, ప్రీతి, రాజేశ్వరి జట్టు రజత పతకం సాధించింది. గోల్ఫ్ క్రీడలో మహిళల వ్యక్తిగత విభాగంలో అదితి అశోక్ రజత పతకం గెలిచింది. ఆసియా క్రీడల్లో గోల్ఫ్ లో పతకం గెలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. వీటితో ఇప్పటి వరకు భారత్ గెలుచుకున్న పతకాల సంఖ్య 41కి చేరింది. అందులో 11 స్వర్ణాలు, 16 రజతాలు, 14 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక ఇవాళ సాయంకాలం స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ 50 కేజీల విభాగంలో సెమీస్‌లో తలపడుతుంది. బ్యాడ్మింటన్ టీమ్ విభాగం ఫైనల్లో భారత్ చైనాతో పోటీపడుతుంది. లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ ఫైనల్‌కు చేరాడు.

---------------------------

విశాఖపట్నం రైల్వేస్టేషన్లో ప్రయాణీకులకు సౌకర్యాల కల్పనలో అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపట్ల రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నం స్టేషన్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం కొత్తగా ఏర్పాటు చేసిన రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను ఆమె, రాజ్య సభ సభ్యులు జివిఎల్ నరసింహారావుతో కలిసి, ప్రారంభించారు.

=====================